క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ బాలాజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ టి.విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఫోకస్, లెన్స్‌కార్ట్, రోడ్డు నం.1 కుడి పక్కన, ధనలక్ష్మి సెంటర్, ఎల్ఐజీ జీహెచ్ఎంసీ పార్కు, మాన్యావర్ షాపింగ్ మాల్ వెనుక పక్కన, ఎల్ఐజీ 1-280, మ్యాక్స్ హెల్త్, ప్రసాద్ హాస్పటల్, ఎంఐజీ 614 నాలా, ఫంక్షన్‌హాలు రోడ్డు, ఎంఐజీ 615, ఎంఐజీ 47, 48, టెంపుల్ బస్‌స్టాప్ కింద భాగంలో, హోలిస్టిక్ ఆసుపత్రి, తిరుమల బ్యాక్టరీ, చైతన్య బార్‌అండ్ రెస్టారెంట్, ఆర్ఎస్ బ్రదర్స్, చందనా బ్రదర్స్ లైన్, ఏఈ స్విచ్, సితారా హోటల్, ఎంఐజీ 1-110, మసీదు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ మంగళవారం ఉదయం 10గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి 1 కోటి 13 లక్షల 90 వేల రూపాయల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సప్తగిరి కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, శుభోదయానగర్ కాలనీ, ఏఎస్‌రాజునగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు పాల్గొనాలని కోరారు.

నగరంలో బిర్కిన్‌స్టాక్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ అంతర్జాతీయ ఫుట్‌వేర్ బ్రాండ్ బిర్కిన్‌స్టాక్ నగరవాసులకు అందుబాటులోకి వచ్చింది. నగరంలోని కూకట్‌పల్లిలో ఉన్న నెక్సస్ మాల్, కొండపూర్‌లోని శరత్ సిటీ మాల్స్‌లో తమ బ్రాండ్ షోరూమ్స్‌ను ప్రారంభించినట్టు బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గాయత్రినగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. సోమవారం ఆమె డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లోని లైబ్రరీ పార్కు లైన్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, సంజయ్‌రెడ్డి,మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, జ్ఞానేశ్వర్, యోగిరాజ్, రవీందర్‌రెడ్డి, సంజీవ, వెంకటరమణ, లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్: ఫిరోజ్‌గూడ సెక్షన్ నూతన ఏఈగా బాధ్యతలు చేపట్టిన రాణిబాయి సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ డివిజన్‌లోని అన్ని వార్డుల్లో ఏర్పడే విద్యుత్ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ రమేష్ రెడ్డి, లైన్‌మెన్ రామారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయస్వామి ఆలయానికి మైక్‌సెట్



ఆల్విన్‌కాలనీ: దీనబంధుకాలనీలో శ్రీశివభక్త మార్కండేయస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయానికి తులసీనగర్‌కు చెందిన మన్నె రామకిష్టయ్య పటేల్, ఆయన కుమారుడు సంస్కార్ గ్లోబల్ సొల్యూషన్స్ అధినేత మన్నె సతీష్ కుమార్‌లు ఆలయ పూజారికి మైక్‌సెట్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తేళ్ల హరికృష్ణ, జిల్లా ఓబీసీ మోర్చా స్పోక్స్‌పర్సన్ భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



అరుణకుమారి (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హెచ్ఎంటీ శాతవాహననగర్ కాలనీలో నివాసం ఉంటున్న అరుణకుమారి(72) ఉదయం నిద్ర లేచిన కుటుంబీకులకు ఆమె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలు మానసిక స్థితి సరిగా లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పనుల పురోగతిపై శాఖలవారీగా సమీక్ష

అధికారులకు పలు సూచనలు చేసిన జెడ్‌సీ మమత



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ మమత, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత ఆధ్వర్యంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ, ట్రాఫిక్ పోలీస్, సీఆర్ఎంపీ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.

- ఈ సందర్భంగా జెడ్‌సీ మమత గత సమావేశంలో తీర్మాన పనుల పురోగతిపై శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. హస్మత్‌పేట్ లేక్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ అనుమతి గురించి సమతానగర్, సనత్‌నగర్ రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న లైన్ షిఫ్టింగ్ సమస్యలపై చర్చించారు.
- అల్వాల్ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న నాలా విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపుపై డిప్యూటీ డైరెక్టర్, పార్కులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- సీఆర్ఎంపీ ఏజెన్సీ వారు మాట్లాడుతూ... సిక్కు బస్తీలో రోడ్డు నిర్మాణ భాగంలో ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్, విద్యుత్ శాఖ వారు ముందస్తు సమాచారం లేకుండా రోడ్లు కటింగ్ చేయటాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు.
- ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ.. సమాచారం లేకుండా రోడ్‌లను కటింగ్ చేయవద్దని అన్ని శాఖల వారికి సూచించారు.
- ట్రాఫిక్ పోలీస్ వారు మాట్లాడుతూ.. ప్రగతినగర్ మార్గంలో శ్రీనివాస స్టీల్స్‌కూడలిలో పోల్ షిఫ్టింగ్, జంక్షన్ అభివృద్ధి గురించి ఆమెకు తెలిపారు.
- మోర్ సూపర్‌మార్కెట్, బ్రాండ్ ఫ్యాక్టరీ, మిందూప్రాజెక్టు ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు పనులు, రోడ్ డివైడర్ల నిర్మాణం గురించి తెలిపారు.
- మూసాపేట ట్రాఫిక్ పోలీస్ వారు మాట్లాడుతూ.. కైత్లాపూర్ ఫ్లై ఓవర్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలను వెంటనే పరిష్కరించినందుకు జెడ్‌సీకి ధన్యవాదాలు తెలిపారు.
- మూసాపేట సర్కిల్ పరిధిలో ఆర్‌యూబీ దగ్గర రోడ్డు మరమ్మతు పనులు, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి మూసాపేట వరకు నో పార్కింగ్ సైన్ బోర్డు ఏర్పాటు, రోడ్డు డివైడర్ దగ్గర రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, రోడ్డు డివైడర్ల ఎత్తును పెంచాలని కోరారు. ఈ సమావేశంలో ఉపకమిషనర్లు ఉమాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు చేయాల్సి ఉంటుంది

మండల కార్యదర్శి కృష్ణ



సీపీఐ నాయకులతో కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ

బాలానగర్: శ్రీశ్రీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరై మాట్లాడారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యకర్త పార్టీ నిర్మాణంలో పాల్గొనాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చే వరకు పేదల పక్షాల సీపీఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి, రాములు, పార్వతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులకు ఆదానీ గ్రూప్ రూ.80వేల బకాయి

టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం



ఫిరోజ్‌గూడలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాలానగర్: ఆదానీ ఆర్థిక అవకతవకలపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఫిరోజ్‌గూడలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాన్యుల కష్టార్జిత పొదుపు ఖర్చుతో తన సన్నిహితులకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ వంటి పీఎస్‌యూలు మన దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. భారతీయ బ్యాంకులకు ఆదానీ గ్రూప్ సుమారు రూ.80వేల కోట్లు బకాయి పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, నల్లోల రాజేందర్, మధుమోహన్, జావీద్ ఆలీ, విఠల్ రెడ్డి, శామ్యూల్, బాల నర్సింహ, నరసింహయాదవ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి, రచయిత దరువు అంజన్నకు నంది అవార్డు



నంది అవార్డు అందుకున్న దరువు అంజన్న

కూకట్‌పల్లి: తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాకవి, రచయిత దరువు అంజన్నకు నంది అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ... మలిదశ తెలంగాణ ఉద్యమం సిద్దిపేట కేంద్రంగా తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో దరువు అంజన్న పోరాటాలు సాగించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తం పల్లెపల్లెకు తిరిగి ఉద్యమ భావజాలాన్ని, తెలంగాణ వెనుకబాటుతనాన్ని తన పాటల ద్వారా వినిపించి ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చాడని కొనియాడారు. అనంతరం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. దరువు అంజన్న తెలంగాణ అందరికి సుపరిచితుడన్నారు. అంజన్న త్యాగం వెలకట్టలేనిదని ఇలాంటి త్యాగధనులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దమ్మన్నపేట రాజు, బుల్లెట్ వెంకన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ సమావేశానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు.

పరామర్శ



టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాతృమూర్తి కాసాని కౌసల్య చిత్రపటానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్, కాసాని వీరేష్‌ముదిరాజ్‌లను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. – నిజాంపేట్

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం



క్రీడా ప్రాంగనం, మార్కెట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 6వ ఫేజులోని మల్టీపర్పస్ క్రీడా ప్రాంగణం, మోడల్ మార్కెట్‌ను సోమవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లో సమస్యలు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఖాళీ స్థలాలను కమ్యూనిటీహాళ్లు, పార్కులు, క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇవి భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. యువత వీటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు.

అభినందనలు



అగ్నిపథ్‌లో ఉద్యోగం పొందిన శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: దేశానికి సేవ చేసే అవకాశం కేవలం భారత సైనికులకు మాత్రమే దక్కిందని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్‌కు చెందిన శ్యామ్ కుమార్ మొదటి బ్యాచ్‌లో అగ్నిపథ్‌లో ఉద్యోగం పొందిన సందర్భంగా సోమవారం శ్యామ్‌కుమార్‌ను కార్పొరేటర్ మహేందర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై జవాన్, జైకిసాన్ అన్న నినాదంతో మొదటి ప్రాధాన్యత జవాన్ అయితే రెండో ప్రాధాన్యత కిసాన్ అన్నారు. దేశ సేవలో నిమగ్నమై నిరంతరం దేశాన్ని రక్షించడంలో సైనికుల కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి తదితరులు ఉన్నారు.

ఏసీ క్లబ్ హౌస్ ప్రారంభం



క్లబ్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఏసీ క్లబ్ హౌస్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద భాస్కర్‌రావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, వడ్డేపల్లివాసులు పీఎస్ఆర్‌కె భగవాన్, దశరథ్ రెడ్డి, దేవేందర్, రాము, నాంచారయ్య, వెంకట్రావు, నర్సారావు, వెంకటరత్నం, చారీ,శంకరయ్య, ప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా



కాలనీ డ్రైనేజీ సమస్యను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌లో డ్రైనేజీ, నీటి పైప్‌లైన్ సమస్యను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజర్ వెంకటేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంతోమంది నిరుపేదలు ఉండే ఈ కాలనీలో రోడ్లను నిర్మించుకున్నామని తెలిపారు. అదే విధంగా త్వరలో డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జయశంకర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



జయశంకర్‌కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని జయశివశంకర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కాలనీవాసులు సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కాలనీ సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయశంకర్‌కాలనీలో చివరనున్న బ్లాక్ 150 వద్ద డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండి బస్తీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నూతన డ్రైనేజీ లైన్ అనుమతి వచ్చిన తరువాత సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. వీధి దీపాలు తక్షణమే అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

- దోమల బెడదకు కాలనీలో వెంటనే ఫాగింగ్ చేయాలని బల్దియా సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని కాలనీవాసులను కోరారు. ఉదయం వచ్చే ఆటో వారికి మాత్రమే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, మేనేజర్ ఝాన్సీ, వర్కు ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, సూపర్‌వైజర్ శివ, వీధిలైట్ల సూపర్‌వైజర్ నరేష్, నాయకులు గుడ్ల శ్రీనివాస్, షౌకత్ అలీ, మున్నా, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ కె 2019 అమెండ్‌మెంట్ యాక్ట్‌ను రద్దు చేయాలి



గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫార్మ అసోసియేషన్ నాయకులు

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన షెడ్యూల్ కే-2019 అమెండ్‌మెంట్ యాక్ట్ ఫార్మసీ విద్యా వ్యవస్థకు తూట్లు పొడిచేలా ఉందని తెలంగాణ ఫార్మా అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఈ అమెండ్‌మెంట్ యాక్ట్‌ని రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆ యాక్ట్‌ను రద్దు చేయించాలని వారు సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావును కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె. బాలరాజు, జనరల్ సెక్రటరీ కె.శ్రీకాంత్, సంతోష్ నాయక్, ఎం.శివ, జి.అవినాష్ పాల్గొన్నారు.

కేన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి సాయం



కేన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్న తోటి విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: కేన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు తోటి విద్యార్థులు. కూకట్‌పల్లి దీనబంధు కాలనీకి చెందిన గ్లోబల్ మోడల్ హైస్కూల్‌లో యూకేజీ చదువుతున్న ఆశ్రీత్ అనే ఐదేళ్ల విద్యార్థి కేన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్. వెంకటస్వామి, ప్రిన్సిపాల్ నాగరాజు ఆర్థిక సహాయం చేయాలని విద్యార్థులకు సూచించారు. దీంతో విద్యార్థులు తమ తోటి విద్యార్థికి తమ వంతు సాయంగా ఆర్థికసాయం చేశారు. ఆశ్రీత్‌కు మరింత ఆయుష్షును ఇవ్వాలని ఆ భగవంతుడిని వేడుకుందాం వీలైతే మనం కూడా సాయం చేద్దామని వెంకటస్వామి పేర్కొన్నారు.

సత్తాచాటిన షావలిన్ మార్షల్ అకాడమీ విద్యార్థులు



కూకట్‌పల్లి: ఎల్‌బీ స్టేడియంలో సోమవారం మూడో నేషనల్ ఓపెన్ కరాటే, కుంగుఫూ చాంపియన్‌షిప్ 2023 సీఎం కేసీఆర్ మెగా కప్ పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీల్లో బాలాజీనగర్‌కు చెందిన షావలిన్ మార్షల్ అకాడమీ మాస్టర్ నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో సిరిపురం విక్షిత్‌రెడ్డి, గుస్కా రాహుల్, కంకణాల అశ్విన్ నందన్, రంగోళి బహిశికలకు బంగారు పతకాలు సాధించారు. రంగోళి సూర్య, కుపాల జశ్వంత్, కుపాల త్రిపాంత్, గుళ్లిపల్లి యశ్వంత్, గోనిపూడి వెంకట కాశి, విద్యశ్రీలు రజత పతాకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మాస్టర్ నాగరాజు అభినందించారు.

హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర షురూ

- యాత్రను ప్రారంభించిన డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లిలో యాత్రను ప్రారంభిస్తున్న టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: ఏఐసీసీ ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ పిలుపు మేరకు.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచనల మేరకు దేశ వ్యాప్తంగా ప్రారంభమైన 'హాత్ సే హాత్ జోడో' అభియాన్ యాత్రను టీపీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ జోడో యాత్ర సందేశాన్ని ఇంటింటికి వెళ్లి తెలియజేస్తామన్నారు. అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముకుంటోందన్నారు. కేవలం మతం ఆధారంగా దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఆ ప్రయత్నాలకి ప్రజలని చైతన్యవంతం చేయాలని చెప్పి హాత్ సే హాత్ జోడో అభియాన్ ఒక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

- ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, నల్లోల రాజేందర్, మధుమోహన్, జావీద్ ఆలీ, విఠల్ రెడ్డి, శామ్యూల్, బాల నర్సింహ, నరసింహయాదవ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- యాత్ర సందర్భంగా అంబులెన్స్ ఏర్పాటు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న గొట్టిముక్కల వెంగళరావు, డా. విశ్వతేజేశ్వరరావు తదితరులు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర ప్రారంభం సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డా.గొట్టిముక్కల విశ్వతేజేశ్వరరావు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బషీర్‌భాయ్, గూడెపు నాగార్జున, సునీల్‌యాదవ్, అరవింద్‌రెడ్డి, నాగార్జున, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.